నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 16 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, జూన్ 15 : కాగజ్‌నగర్ పట్టణంలోని తిలక్‌నగర్‌లో దేశీదారు బాటిళ్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. తిలక్‌నగర్‌కు చెందిన యేనం రాజు దేశీదారు నిల్వ చేసి దేశీ విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించారు. అతని వద్ద రూ.లక్షా యాభైవేల విలువైన బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ సురేశ్, సిబ్బంది శ్రీనివాస్, మల్లేశ్, సతీశ్ మండల్, స్రవంతి ఉన్నారు.

పట్టుకున్న దేశీదారుతో ఎక్సైజ్ అధికారులు, నిందితుడు

మంచిర్యాల కలెక్టర్‌గా కుమార్ దీపక్

- నాగర్ కర్నూల్‌కు బదిలీ అయిన బదావత్ సంతోష్
- ఉత్తర్వులు విడుదల చేసిన సీఎస్

మంచిర్యాల, జూన్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా శనివారం 20 మంది ఐఏఎస్‌లు బదిలీలయ్యారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా ఉన్న బదావత్ సంతోష్ నాగర్‌కర్నూల్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న కుమార్ దీపక్ మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీఅయ్యారు. ఆయన స్థానంలో జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్‌గా పని చేస్తున్న అభిలాష అభినవ్ నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా రానున్నారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు.

నూతన కలెక్టర్ కుమార్ దీపక్

బదిలీపై వెళ్తున్న బదావత్ సంతోష్

రైతు భరోసా రాక.. రుణాలందక

సాగు పెట్టుబడి కోసం కర్షకుల అవస్థలు

- డబ్బు ల్లేక వ్యాపారులను ఆశ్రయిస్తున్న వైనం
- తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్దెరకు ఎరువులు, విత్తనాల కొనుగోలు
- ఇదే అదనుగా ధరలు పెంచేసి విక్రయిస్తున్న ఫర్టిలైజర్స్ యజమానులు
- అగమ్య గోచరంగా అన్నదాతల పరిస్థితి

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ) / సిర్పూర్(యు), జూన్ 15 : వానకాలం సాగు పెట్టుబడి కోసం రైతాంగం తిప్పలు పడుతున్నది. పంటలు వేసే సమయం దాటిపోతున్నా, రాష్ట్ర సర్కారు రైతుభరోసాపై ఊసెత్తకపోవడంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. మరోవైపు రూ. 2 లక్షల రుణమాఫీపై స్పష్టత ఇవ్వకపోవడం.. కొత్తగా పంట రుణాలు తీసుకునే అవకాశం లేకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో విత్తనాలు, ఎరువులు ఉద్దెర తెచ్చుకుందామని వ్యాపారుల వద్దకు వెళ్తే.. ఇదే అదనుగా ధరలు పెంచేసి అమ్ముతున్నారంటూ వారు వాపోతున్నారు.

రైతు కొనుగోలు చేసిన విత్తనాలు


రైతులకు వ్యాపారులు ఇచ్చిన రసీదులు

అయోమయంలో రైతులు..

ఈ ఏడాది వర్షాకాలంలో 4,52,248 ఎకరాల్లో పంటలు సాగవుతుండగా, ఇందులో అత్యధికంగా పత్తి 3.40 లక్షల ఎకరాల్లో వేస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే వానకాలం సాగు పనుల్లో రైతాంగం నిమగ్నంకాగా, సర్కారు రైతుభరోసా ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గతేడాది యాసంగికి సంబంధించిన డబ్బులే ఇంకా అందించలేదు. ఇక పంట రుణాలు తీసుకుందామనుకుంటే.. బ్యాంకర్లు పాత అప్పు తీరుస్తేగాని కొత్తగా రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణామాఫీ చేస్తుందో లేదోనని రైతులు అయోమయంలో పడిపోతున్నారు. ఇటు రైతు భరోసా అందక.. అటు పంటరుణాలు పొందలేక అష్టకష్టాలు పడుతున్నారు.

ఇష్టారాజ్యంగా ధరలు పెంచేసి..

రైతుభరోసా రాక.. రుణాలు దొరకక దిక్కులేని పరిస్థితుల్లో పంట పెట్టుబడి కోసం ఫర్టిలైజర్స్ వ్యాపారులను ఆశ్రయిస్తే.. ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచేసి ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో వారు చెప్పిన ధరకు తీసుకోవాల్సి వస్తున్నదని చెబుతున్నారు. ఇక రైతులు కోరిన విత్తనాలు కాకుండా ఏవేవో కంపెనీలకు చెందిన విత్తనాలు అందిస్తున్నారని, ఇదేమని అడిగితే తీసుకుంటే తీసుకోండి.. లేదంటే లేదని చెబుతున్నారని అన్నదాతలు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో మంచి దిగుబడిని ఇచ్చే బ్రాండెడ్ విత్తనాలుగా పేరుగాంచిన తులసీ, కబడ్డీవంటి విత్తనాలు కావాలని అడిగితే వ్యాపారాలు వాటిని ఇవ్వడం లేదు. 10 ప్యాకెట్ల విత్తనాలు అడిగే, రైతుకు ఒక బ్రాండెడ్ విత్తనాల ప్యాకెట్లు మరో తొమ్మిది ప్యాకెట్లు ఇతర కంపెనీలకు చెందినవి అప్పగిస్తున్నారు.

ఉద్దెర తెచ్చుకున్న

వానకాలం పంటల సాగుకు డబ్బుల్లేకుంటైనయి. కాంగ్రెసోళ్లు ఇప్పటి దాకా రైతు భరోసా డబ్బులు ఇవ్వకపాయే. రుణమాఫీ చేయకపాయే. మళ్లా ఎనకటి కాలం వచ్చినట్లైంది. డబ్బుల్లేక జైనూర్‌లోని ఫర్టిలైజర్ దుకాణానికి పోయిన. ఉద్దెర కింద 5 బ్యాగుల పత్తి విత్తనాలు తెచ్చుకున్న. డబ్బులుంటే కావాల్సిన విత్తనాలు కొనుక్కునే వాన్ని.. కానీ యజమాని ఇచ్చిన విత్తనాలు తెచ్చుకున్న. అవి ఏ కంపెనో కూడా నాకు తెల్వదు. ఉద్దెర కాబట్టి ఏ ధరకు అమ్మినా తీసుకోవాల్సి వస్తుంది. *- మర్సకోల సోనేరావ్, రైతు, భీమన్‌గొంది, లింగాపూర్*

ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయం

రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

కోటపల్లి, జూన్ 15 : ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయమని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. పోలీసులు-మీ కోసం కార్యక్రమంలో భాగంగా శనివారం కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో నీల్వాయి, కోటపల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని యువకులతో సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ యువత లక్ష్యంతో ముందుకు సాగి అభ్యున్నతి సాధించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. గంజాయి, మద్యం, జూదంవంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సంఘవిద్రోహశక్తుల ప్రలోభాలకు లొంగకూడదని, అనుమానితులు కనిపిస్తే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ ముందుంటుందని చెప్పారు. అనంతరం కోటపల్లి, నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల యూత్‌కు వాలీబాల్, క్రికెట్ కిట్లు, జెర్సీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ పాల్గొన్నారు.

కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో యువతకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్

ఇది వరకు గిట్ల గోసపడలే

కాంగ్రెస్ సర్కారోళ్లు ఇప్పటి దాకా రైతు భరోసా ఇయ్యలేదు. పెట్టుబడికి డబ్బుల్లేక మస్తు తిప్పలపడుతున్నం. నేను మొన్న దుకాణానికి పోయి 10 పత్తి విత్తనాల ప్యాకెట్లు ఉద్దెర తెచ్చుకున్న. ఏ విత్తనాలు ఇచ్చిర్రో కూడా తెల్వదు. వాళ్లు చెప్పిన ధరకే తెచ్చుకున్న. పంట చేతికొచ్చినంక డబ్బులు కడుతానని చెప్పిన. కేసీఆర్ సర్కారులో గిట్ల గోసపడలే.

- పుస్నాక భీంరావ్, రైతు, దుబ్బ గూడ, జైనూర్

విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

- మిషన్ భగీరథ ఇంటింటి సర్వే త్వరగా పూర్తవ్వాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

బూరుగూడలోని ఓ దుకాణంలో రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 15 : విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండలం బూరుగూడ మెయిన్ రోడ్డులోని కళావతి విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల గోదాం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కంపెనీ నిర్ణయించిన ధరలకే విత్తనాలు, ఎరువులను విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాన్ని సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ఓ రైతును ఎంత ధర పెట్టావని అడుగగా, ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రసీదుల్లో ఉన్న రైతులకు ఫోన్ చేసి ఎవరెవరికి ఎంత ధరకు విక్రయించారో తెలుసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

ఇంటింటి సర్వే త్వరితగతిన పూర్తిచేయాలి

ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకే మిషన్ భగీరథ సర్వే చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం మోతుగూడలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పర్యటించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీలను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజినల్ పంచాయతీ అధికారి ఒమర్ హుస్సేన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మిషన్ భగీరథ సహాయ ఇంజినీర్ శైలేందర్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీ పనులపై ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్, గదుల మరమ్మతుల పనులు సత్వరమే పూర్తిచేయాలని తెలిపారు.

నాణ్యమైన విద్యను అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. తుంపెల్లి ప్రభుత్వ పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాలు కురిసినపుడు పాఠశాల భవనం పై కప్పు ఉరుస్తుందని, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఉపాధ్యాయులు తెలపడంతో కలెక్టర్ వెంటనే స్పందించి డాంబర్ షీట్ ఏర్పాటు చేయించారు.